## కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ పరామర్శ


రాములును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి, ఫిబ్రవరి 14: మండలంలోని వెలుగుపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లెపాక రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆసుపత్రిలో రాములును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.20 వేలు ఆర్థిక సాయంగా అందించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, మున్నా మల్లయ్య, ఉప్పలయ్య, మాజీ వైస్ ఎంపీపీ శ్రీశైలం, నాయకులు గుండగాని రాములుగౌడ్, గుడిపాటి వీరయ్య, యాకుబ్, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణయ్యకు మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నివాళి


కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

మోతె, ఫిబ్రవరి 1: మండలంలోని సర్వారం మాజీ సర్పంచ్ మేకల గురుకృష్ణ తండ్రి కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ఏలూరి వెంకటేశ్వర రావు సతీమణి పార్వతి ఐదో వర్ధంతిలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు మిక్కిలినేని సతీశ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, కుదురుపాక రమేశ్, వీరబోయిన యలమంచి, మేకల మధు, హవతు వెంకన్న పాల్గొన్నారు.

## నీళ్లు లేక ఎండిపోతున్న పంటలు

- ఆందోళనలో రైతన్నలు


బీక్యా తండాలోఎండిపోయిన పొలాన్ని చూపిస్తున్న రైతు రవి

మోతె, ఫిబ్రవరి 14: అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తున్న రైతులకు కన్నీరే మిగులుతున్నది. పొట్టదశకు వచ్చిన పొలాలకు సరిపడా నీరు లేక ఎండిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోతె మండలంలోని గ్రామాలకు ఎస్సారెస్పీ కాల్వ నీరు అందడం లేదని గత కొద్దిరోజులుగా రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఎస్సారెస్పీ కాల్వ ఆధారంగా పంటలు సాగు చేశామని, కాల్వలో నీరు రాకపోవడంతో కళ్ల ముందు వరి పంట ఎండిపోయి పశువులకు మేతగా మారుతున్నదని పలువురు రైతులు వాపోతున్నారు.

**నాలుగెకరాల్లో పంట ఎండిపోయింది..**
**-బాణోతు రవి, బీక్యాతండా**

మాకున్న ఎకరం పొలంతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. గతంలో మాదిరిగానే ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీళ్లు వస్తాయన్న నమ్మకంతో సాగు చేశాను. అయితే, కాల్వ నీరు రాకపోవడంతో పొట్టదశకు వచ్చిన వరి పొలం పూర్తిగా ఎండిపోయింది. ఉన్న బోర్లు కూడా పూర్తిగా ఎండిపోయాయి. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాను. పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

## పెద్దగట్టు జాతరకు 60 ప్రత్యేక బస్సు సర్వీసులు

- ఆర్టీసీ నల్లగొండ ఆర్ఎం జాన్‌రెడ్డి


జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ సురేందర్

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 14: పెద్దగట్టు జాతరకు జిల్లా కేంద్రం నుంచి 60 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ నల్లగొండ ఆర్ఎం జాన్‌రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. జాతర ప్రారంభం కానున్న 16వ తేదీ తెల్లవారుజాము నుంచి 20వ తేదీ వరకు బస్సులను నడుపుతామని వెల్లడించారు. పెద్దలకు టికెట్ ధర రూ.40, పిల్లలకు రూ.20గా నిర్ణయించినట్లు తెలిపారు. కాగా, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు.

**మొదటి సర్వీసు ప్రారంభం**

లింగమంతుల జాతరకు ఆర్టీసీ ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక బస్సు సర్వీసుల్లో భాగంగా ఆనవాయితీ ప్రకారం శుక్రవారం డిపో నుంచి మొదటి బస్సును డిపో మేనేజర్ సురేందర్ డప్పువాయిద్యాల నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు క్షేమంగా స్వామివారిని దర్శించుకొని తిరిగి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ పూజ చేసి సర్వీసును ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

## 'పోస్టల్ శాఖ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి'


పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 14: పోస్టల్ శాఖ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జేఏసీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తపాలాశాఖను ప్రైవేటీకరణ చేయడం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన 2023 పోస్టాఫీస్ యాక్ట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం డివిజన్ సూపరింటెండెంట్ వి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, నాగరాజు, పరమేశ్, రవి, పుల్లయ్య, కరీం, కరుణాకర్, దివ్య, మమత, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**పూర్తిగా ఇంటి పేరు రావడం కోసం**
దుర్గం జంగయ్య, S/o. నర్సింహ్మా, దుర్గం సాయికీర్తన, వయస్సు:11 సం॥రాలు, అర్హత 6th వృత్తి: విద్యార్థిని, R/o.H.No.2-27 గ్రా॥దేశ్‌ముఖి, మం॥ భూదాన్ పోచంపల్లి, జిల్లా యాదాద్రి భువనగిరి, సాయి కీర్తన అనే నేను నా యొక్క బర్త్ సర్టిఫికెట్‌లో నా తల్లిదండ్రుల ఇంటి పేరు పూర్తిగా పడకుండా 'D' అనే అక్షరం పడిన నేపథ్యంలో పూర్తిగా ఇంటి పేరు రావడం కోసం దుర్గం జంగయ్య, దుర్గం పద్మ, దుర్గం సాయి కీర్తనగా మార్పు చేయనైనది అని గమనించగలరు.

**GOLD FINANCE**
★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635 |
| హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638 |
| మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638 |


# పెద్దగట్టు జాతర పనుల్లో నాణ్యతా లోపం

- మిగిలింది ఒక్క రోజే.. అయినా ఎక్కడి పనులు అక్కడే


ఫంక్షన్ హాల్ ఎదుట సీసీ రోడ్డుపై వేసిన ప్యాచ్‌వర్క్ కంకరతేలిన దృశ్యం

చివ్వెంల, ఫిబ్రవరి 14: పెద్దగట్టు జాతర పనుల్లో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. జాతర ప్రారంభానికి మిగిలింది ఒక్కరోజే అయినా పనులు మాత్రం పూర్తికాలేదు. అధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో నాణ్యతా లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. లింగమంతుల స్వామి ఆలయం వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ 1.67 కోట్లతో చేపట్టిన పనులు నామమాత్రంగానే కొనసాగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకే రంగులు, సున్నాలు వేసి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజురోజుకూ పెద్దగట్టుకు భక్తుల తాకిడి పెరుగుతున్నది. ఇప్పటికే చిరు వ్యాపారులు జాతర ప్రాంగణానికి చేరుకున్నారు. వారికి కనీసం వాడుకునేందుకు, తాగేందుకు నీరు లేక బోరింగ్‌లను ఆశ్రయిస్తున్నారు. శానిటేషన్, తాగునీటి నల్లాల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఆలయానికి వెళ్లే ప్రధాన దారిలో ఫంక్షన్ హాల్ ఎదుట చేసిన ప్యాచ్‌వర్క్‌కు నీళ్లు పోయకుండా వదిలేయడంతో పెచ్చులు లేస్తున్నాయి. ఎగ్జిబిషన్ గ్రౌండ్ పక్కనే ఉన్న నీటి సంపునకు అనుసంధానంగా నిర్మించిన ప్లాట్‌ఫాంకు నీళ్లు పోయకుండా వదిలేయడంతో మెట్లకు పెచ్చులు ఊడిపోతున్నాయి. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నల్లా దిమ్మెలకు ఇంత వరకు నల్లాలు ఏర్పాటు చేయలేదు. సింహద్వారం సమీపంలో నిర్మించిన మరుగుదొడ్ల ముందు వేసిన ప్లాట్‌ఫాంలో కంకర తేలి గుంతలు కనిపిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారికేడ్లకు అక్కడక్కడా కర్రలు ఊడిపోయాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన నిర్మించిన నీటి సంపు మెట్లకు ప్లాస్టిరింగ్ చేయకుండానే వదిలేశారు. నల్లా దిమ్మెల వద్ద ఔట్‌ఫ్లో తాత్కాలిక ఇంకుడుగుంతలకు వేసిన పైపులైన్లు పగిలిపోయాయి.


క్యూరింగ్ చేయకపోవడంతో తెల్లగా మారిన కాంక్రీట్ నిర్మాణం

## పెద్దగట్టు జాతరకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


పెద్దగట్టు ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస నందలాల్ పవార్

చివ్వెంల, ఫిబ్రవరి 14: పెద్దగట్టు జాతరకు ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శుక్రవారం పెద్దగట్టు ఆలయ ప్రాంగణాన్ని అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పటిష్ఠ బందోబస్తు నిర్వహించేందుకు రెండు వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ప్రత్యేకంగా వంద మంది షీ టీమ్స్, 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శానిటేషన్ సిబ్బంది 90 మంది ఐదు రోజుల పాటు మూడు షిఫ్టుల్లో పనిచేయనున్నారని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా 110 మంది సిబ్బంది, అధికారులు పర్యవేక్షించనున్నారని, మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ ద్వారా భక్తులకు తాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. గుట్ట పరిసర ప్రాంతాల్లో 25 చోట్ల నల్లాలు,12 చోట్ల టబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8 చోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పెద్దగట్టు ఆలయ చైర్మన్ పోలెబోయిన నర్సయ్యయాదవ్, సీపీఓ కిషన్, జిల్లా వైద్యాధికారి కోటాచలం, డీఎస్పీ రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తాసీల్దార్లు కృష్ణయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, ఈఓ కుశలయ్య, ఈఈలు శ్రీనివాసరావు, కరుణాకర్‌రెడ్డి, విద్యుత్ శాఖ అధికారి పాలరాజ్, ఏడీఏ రాములు నాయక్, అగ్నిమాపక అధికారి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**అజొల్లా సాగు చేపట్టాలి : కలెక్టర్**

అజొల్లా సాగుతో అనేక లాభాలు ఉన్నాయని, సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ అన్నారు. మండల పరిధిలోని గుంజలూరు గ్రామంలో పెదపోలు జయమ్మ అనే మహిళా రైతు తన ఇంటి ఆవరణలో ఉపాధి హామీ పథకం భాగంగా సాగు చేసిన అజొల్లాను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. అజొల్లా పశువులకు దాణాగా, వరి పొలాల్లో కలుపు పుట్టకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. డీఆర్‌డీఓ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి, ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, ఎంపీఓ దయాకర్, ఏపీఓ నాగయ్య, ఈసీ జ్యోతి, టీఏ విజయ్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి పాల్గొన్నారు.

### పెద్దగట్టు ప్రాంగణాన్ని పరిశీలించిన భద్రతా సిబ్బంది

చివ్వెంల,ఫిబ్రవరి 14: పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ప్రాంగణాన్ని జిల్లా సెక్యూరిటీ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్న జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంతో పాటు ఎగ్జిబిషన్ గ్రౌండ్, పార్కింగ్ ప్రదేశాలు, బస్టాండ్ ప్రాంతం, మర్రిచెట్టు కింద తనిఖీలు చేశారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 14: మేళ్లచెర్వు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 11 కేవీ విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా మేళ్లచెర్వు, వెల్లటూరు గ్రామాల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కోదాడ రూరల్: మండల పరిధిలోని ఎర్రవరం, రామలక్ష్మీపురం, భీక్యాతండా గ్రామాల్లో శనివారం విద్యుత్ తీగల మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### కబడ్డీ పోటీలు ప్రారంభం

కోదాడ రూరల్, ఫిబ్రవరి 14: మండల పరిధి నల్లబండగూడెం గ్రామంలో చిన్నగట్టు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యరమాల సుశీలబెంజిమెన్, మాజీ ఎంపీటీసీ యరమాల క్రాంతికుమార్, అల్సగాని శరభయ్య, ముండ్రా రంగారావు, మేకల ప్రతాప్, ముండ్రా శివరామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ కె.రామారావు, నెలవెల్లి నారాయణరావు, బి.పూర్ణయ్య, జి.గోపినాథ్, కె.నాగేశ్వర రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆటోని ఢీకొట్టిన ట్రాక్టర్

- ఆరుగురికి తీవ్రగాయాలు
- చిలుకూరులో ఘటన

చిలుకూరు/హుజూర్‌నగర్, ఫిబ్రవరి 14: ఆటోని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన 10 మంది ఆటోలో శుక్రవారం మునగాల మండలంలోని తురకగూడెంలో ఓ వ్యక్తి అంత్యక్రియలకు వెళ్లారు. తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా చిలుకూరులోని బ్రిడ్జి వద్దకు రాగానే హుజూర్‌నగర్ నుంచి వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ఆటోలోని నాగమణి, మరియమ్మ, సుజన, తెరోజమ్మ, బక్కమ్మ, మేరమ్మకు తీవ్రగాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం తీవ్రంగా గాయపడిన ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని చిలుకూరు ఎస్ఐ రాంబాబుగౌడ్ పరిశీలించి విచారణ చేపట్టారు.

### న్యాయవాదుల విధుల బహిష్కరణ

సూర్యాపేట లీగల్, ఫిబ్రవరి 14: రంగారెడ్డి కోర్టులో మహిళా న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం సూర్యాపేట కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు మళ్లీ చోటుచేసుకోకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## 'దేశ రక్షణలో సైనికుల త్యాగం మరువలేనిది'


నేరేడుచర్ల: అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 14: దేశ రక్షణలో అమరులైన సైనికుల త్యాగం మరువలేనిదని సూర్యాపేట పట్టణ ఎస్ఐ వాసా ప్రవీణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఎక్స్ సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. అమర జవాన్ల సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరని అన్నారు. కార్యక్రమంలో సీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎల్.ఎన్. నాయక్, జేపీ.యాదయ్య, పి.చంద్రయ్య, మాజీ సైనికులు సీహెచ్.జయరాజ్, షేక్ అబ్దుల్ ఖాదర్, ఎ.నాగయ్య, ఏఎస్ఐ ముత్తయ్య, వాసవీ యూత్ క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

**నేరేడుచర్లలో..**

నేరేడుచర్ల: పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన జవాన్లకు శుక్రవారం నేరేడుచర్లలో ఘన నివాళులర్పించారు. స్థానిక చౌరస్తా నుంచి మాతరం యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుంకర క్రాంతికుమార్, జింకల భాస్కర్, కొణతం లచ్చిరెడ్డి, సీహెచ్.శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 'గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించాలి'

నేరేడుచర్ల, ఫిబ్రవరి 14: నేరేడుచర్ల పట్టణంలో 45 సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని, పాఠకులకు అసౌకర్యంగా ఉన్నందున వెంటనే కొత్త భవనాన్ని నిర్మించాలని పెంచికల్‌దిన్నె మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త సుంకర క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పలువురు నిరుద్యోగులతో కలిసి గ్రంథాలయాన్ని సందర్శించి మాట్లాడారు. గ్రంథాలయంతో ప్రస్తుతం నిరుద్యోగ యువతకు ఉపయోగం లేకుండా పోతుందన్నారు. దీంతో నేరేడుచర్ల, పాలకవీడు మండలాలకు చెందిన యువత మిర్యాలగూడ, హుజూర్‌నగర్‌లలోని లైబ్రరీలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ నేటికీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే నూతన భవన నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జింకల భాస్కర్, కాసాని నాగరాజు, నవీన్, మన్సూర్, వంశీ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

## 'దళితులపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం'

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 14: దేశవ్యాప్తంగా దళితులపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి విమర్శించారు. శుక్రవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, జిల్లా నాయకులు నాగమణి, రమణ, టేకుల సుధాకర్, దుర్గారావు, గిరి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం

నేరేడుచర్ల, ఫిబ్రవరి 14: నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని దాచారం గ్రామంలో శుక్రవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. దాచారంలోని పేద మహిళలకు ఉపాధి కల్పన కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కేంద్రం మూడు నెలలు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి, గుండ్రెడ్డి సైదిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, ఉప్పాల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

- కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి


పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

గరిడేపల్లి, ఫిబ్రవరి 14: వార్షిక తనిఖీల్లో భాగంగా గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌ను కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎవరైనా పోలీసుల సూచనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ చలికంటి నరేశ్, ఏఎస్ఐ రాములు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, రైటర్ లింగయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర బడ్జెట్

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వప్రయోజనాల కోసం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ విషయంలో అఖిలపక్షాన్ని పిలిచి సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, హుస్సేన్, వట్టెపు సైదులు పాల్గొన్నారు.

## నిర్ణీత లోడుతో బొగ్గు లారీలను నడుపాలని ఆందోళన

మఠంపల్లి, ఫిబ్రవరి 14: నిర్ణీత లోడుతో బొగ్గు లారీలను నడుపాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పెదవీడు గ్రామ ప్రజలు శుక్రవారం గ్రామ ప్రధాన రహదారిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి రైల్వే వ్యాగన్ ద్వారా వచ్చిన బొగ్గును నాగార్జున సిమెంట్ పరిశ్రమకు లారీల్లో పరిమితికి మించి సరఫరా చేస్తుండడంతో బొగ్గు రోడ్డుపై పడి వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కూడా సమస్యపై ఆందోళన వ్యక్తం చేశామని, పరిశ్రమ యాజమాన్యం లారీల్లో తక్కువ లోడుతో బొగ్గు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. ఆందోళనలో మాజీ ఎంపీటీసీ వెంకటరెడ్డి, లింగరాజు యాదవ్, నబీ, వీరబాబు, సాయి, సన్నీ, సూర్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 14: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు విద్యాలయాలను సందర్శించి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం సాయిత్రివేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు కృషి చేస్తానని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్ క్లియర్ చేసేలా, ఖాళీగా ఉన్న డీఈఓ, డీఐఈఓ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. సమావేశంలో నాగేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, తన్నీరు ఉపేందర్, నర్సయ్య, శ్రీనివాస్, వెంకటరెడ్డి, సంతోశ్, రవళి, మల్సూర్, నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోదాడ పట్టణంలోని ఎమ్మెస్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో పన్నాల గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో సూరం ప్రభాకర్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు స్వామి, పందిరి నాగిరెడ్డి, చిన్ని, గంగాధర్, నరేశ్, ఎస్ఎస్.రావు, ప్రసాద్, విజయ భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

నూతనకల్, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గంట నాగయ్య, పెద్దింటి రంగారెడ్డి, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేశోజు మధు, మందడి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఇఫ్టూ ఆధ్వర్యంలో..**

ఆత్మకూర్.ఎస్: మండలంలోని పాత సూర్యాపేట గ్రామంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా నాయకులు సామ నర్సిరెడ్డి, చామల లింగారెడ్డి, మెడబోయిన సైదులు, తాటికొండ మల్లారెడ్డి, కుంచం వెంకటయ్య, యాకోబు, శ్రీరాములు పాల్గొన్నారు.

**ఏఐకేఎంఎస్ నాయకులు..**

నాగారం: ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు నాగారంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పోలెబోయిన కిరణ్, సంపెట కాశయ్య, యానాల సుధాకర్‌రెడ్డి, సామేలు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


మేళ్లచెర్వు: స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


తుంగతుర్తి ప్రాథమిక పాఠశాలలో..

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 14: మండల పరిధిలోని రామాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాములునాయక్, పాఠశాల హెచ్‌ఎం బాలయ్య, ఉపాధ్యాయులు వీరయ్య, ఆంజనేయులు, ఎల్లయ్య, షబానా పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘుపతి, ఉపాధ్యాయులు కళమ్మ, గురువయ్య, శ్రీరాములు, సూర్యప్రకాశ్, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్: మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు టి.రామయ్య, ఉపాధ్యాయులు నిమ్మల శ్రీనివాస్, జయప్రద, షర్మిల, సునీత, మమత తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూర్.ఎస్: తుమ్మలపెన్‌పహాడ్ ప్రాథమిక పాఠశాలలో..